క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణం



కోడూరు: పంచాయతీ పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి (ఎస్‌డబ్ల్యూపీసీ) వెళ్లడానికి వీలుగా రూ.24లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని గురువారం ప్రారంభించారు. తొమ్మిదో వార్డు నుంచి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వరకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో చెత్త సేకరణకు ఇబ్బందిగా మారిందని పంచాయతీ సర్పంచి వెన్నా షైనీ ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఎన్‌ఆర్‌జీఎస్ పథకం ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.24 లక్షల నిధులు కేటాయించారు. ఈ రహదారి నిర్మాణ పనులను వేగంగా చేస్తున్నారు. కార్యదర్శి బి.శేషగిరిరావు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

ఘనంగా పోతురాజు స్వామి జాతర

కోడూరు: లింగారెడ్డిపాలెంలోని పోతురాజు స్వామివారి జాతరను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్లకు జలాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. యువకులు వీరతాడు, ఖడ్గాలతో విన్యాసాలు చేస్తూ ఆకట్టుకున్నారు. మహిళలు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారంతా జాతరకు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, సాయిసుప్రియ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో సర్పంచి యర్రంశెట్టి శ్రీదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



మచిలీపట్నంటౌన్: వాసవి వనిత క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు గురువారం పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. నగరంలోని గొడుగు పేటలో ఉన్న క్లబ్ కార్యాలయంలో రీజినల్ చైర్మన్ వేముల నాగ వెంకట శిరీష అధికారిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా వాసవి వనితకుల ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలను పంపిణీ చేయడంతో పాటు 300 మందికి చల్లటి మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు ఎండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుక రాణి, అన్నం అశోక్, క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ దివ్యశ్రీ, వాసవి క్లబ్ అధ్యక్షుడు జేల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అవనిగడ్డలో నూతన కోర్టు ప్రారంభం

ఆరవ అదనపు కోర్టును ప్రారంభించనున్న జిల్లా జడ్జి

అవనిగడ్డ: అవనిగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరవ అదనపు జిల్లా కోర్టుని జిల్లా జడ్జి జి.గోపి శుక్రవారం ప్రారంభించనున్నట్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి వేణుగోపాలరావు తెలిపారు. కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన కోర్టుని శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు చేయాలి

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ను పారదర్శకంగా అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దిబాబు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జీవో నంబర్ 5 ప్రకారం అన్ని డిపార్ట్‌మెంట్లలోని అన్ని క్యాడర్లు, పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తింపజేసి ఎస్సీ, ఎస్టీలకు తగినంత ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్‌లు పారదర్శకంగా అమలు చేయకపోతే విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు.

తీర్మానం లేకుండానే పనులు!



ఇంతేరు పంచాయతీ పార్వతీపురంలో పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత



కొత్తగా పైపులైన్ కోసం తీసిన గోతులు



గతంలో పైపులైన్ల కోసం తీసిన గోతులు

- పార్వతీపురంలో పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కాగిత
- తాగునీటి పైపులైను నిర్మాణంలో తమ్ముళ్ల సరికొత్త డ్రామా
- వర్క్ ఆర్డర్ వచ్చిన వ్యక్తిని కాదని దౌర్జన్యంగా పనులు

కృత్తివెన్ను: పంచాయతీ తీర్మానం లేదు.. నిబంధనలకు నీళ్లు వదిలి సరికొత్త డ్రామాకు తెరతీశారు మండలంలోని పార్వతీపురంలో తెలుగు తమ్ముళ్లు. పంచాయతీలో ఏ పని చేయాలన్నా తప్పని సరిగా తీర్మానంతో కూడిన ఆమోదం పొందాలన్న నిబంధనను 'తమ్ముళ్లు' తుంగలో తొక్కేశారు. ఇదేంటని అడిగితే మా రాజ్యం.. రూల్స్ అన్నీ మా చుట్టూ తిరగాల్సిందేనని ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టారు. సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కొబ్బరికాయ కొట్టి మరీ పనులు ప్రారంభించడంతో అక్కడి సర్పంచ్ అవాక్కయ్యారు. వివరాల్లో కెళితే కృత్తివెన్ను మండలం ఇంతేరు పంచాయతీలోని పార్వతీపురం అనుబంధ గ్రామంలో తాగునీటి అవసరాల కోసం పైపులైను నిర్మించాలి.

నాడు పంచాయతీ తీర్మానంతో..

కొన్ని నెలల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 520 మీటర్లు మేర రూ. 2.72 లక్షలతో



గతంలో నిర్మాణానికి తీసుకొచ్చిన పైపులు

పనులకు పంచాయతీ తీర్మానం చేసింది. వాటిని చేయడానికి పంచాయతీలో వర్క్స్ కమిటీ వేసి పులి భాస్కరరావు అనే వ్యక్తి వర్క్ చేయడానికి తీర్మానం చేశారు. అధికారులు అంచనాలు తయారుచేసి భాస్కరరావు పేరున వర్క్ ఆర్డరు సైతం ఇచ్చినట్లు సర్పంచ్ పెదసింగు మోకమ్మ తెలిపారు. దీంతో భాస్కరరావు పనులు ప్రారంభించి పైపులైను గోతులు తవ్వించి పైపులు సైతం తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్ ఉంది పనులు చేయకూడదని స్థానికంగా ఉన్న కొందరు అభ్యంతరం తెలిపారు. దీంతో కొన్ని రోజులు పనులు వాయిదా పడ్డాయి.

మీరెవరు పనులు చేయడానికి..

తీరా కోడ్ పూర్తయిన తర్వాత పనులు తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నిస్తే స్థానికంగా ఉన్న తెలుగు తమ్ముళ్లు కొందరు మా పార్టీ అధికారంలో ఉండగా మీరెవరు పనులు చేయడానికి అంటూ అడ్డుకున్నారు. దీనిపై సర్పంచ్ భర్త సామోరు స్థానిక ఎమ్మెల్యేకు ఈ విషయాన్ని తెలియజేయగా అటునుంచి సరైన సమాధానం లేదని ఆయన వాపోయారు.

అనుమతి లేని పనులకు శ్రీకారం

ఇదిలా ఉంటే బుధవారం స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అదే పనులకు పూజలు చేసి ప్రారంభించారు. అసలు పంచాయతీకి ఎటువంటి సమాచారం లేకుండా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకుండా పంచాయతీ పైపులైను పనులు చేయడంపై సర్పంచ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారం ఉంది కదా అని నిబంధనలు తుంగలో తొక్కడాన్ని సర్పంచ్ తీవ్రంగా తప్పుపడుతున్నారు.

ఇప్పుడు కొత్తగా ఆర్డర్ రాలేదు

దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగేశ్వరరావును వివరణ కోరగా పైపులైన్ పనులకు సంబంధించి ఇప్పుడేమీ కొత్తగా ఆర్డర్ రాలేదని అసలు అక్కడ పైపులైన్ పనులు చేస్తున్నారన్న సమాచారమే తమకు లేదన్నారు. పంచాయతీ కార్యదర్శి సునీతను అడగగా ఆ పనులకు గతంలో తీర్మానం చేసి పులి భాస్కరరావు పేరున వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఇప్పుడు పనులకు పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి లేదన్నారు.

టీడీపీ నేతలు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు



మా గ్రామంలో టీడీపీ వారు పంచాయతీ నిధులతో జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మేము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులం కావడంతో జరిగే పనులకు ఎక్కడ మాకు పేరు వస్తుందోనని వాటిని అడ్డుకున్నారు. మా గ్రామంలో సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తై ఏడాదిపైనే కావస్తున్నా వాటిని ప్రారంభించలేదు. అవి జగనన్న హయాంలో జరగడంతో ప్రారంభానికి ఒప్పుకోవడం లేదు.

–పెదశింగు సామోరు, ఇంతేరు

అధికారులు ఏం చేస్తున్నారో!



పనులకు పంచాయతీ అనుమతి లేకుండా ఎలా చేస్తారు? కనీసం సర్పంచ్‌కు సమాచారం కూడా ఇవ్వలేదు. నిబంధనలకు విరుద్ధంగా ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

–పెదశింగు మోకమ్మ, సర్పంచ్, ఇంతేరు

నూతన దంపతులకు ఆశీస్సులు

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం తెలుగురావుపాలెంకు చెందిన పెనుముచ్చ పవన్, శిరీషల వివాహానికి మాజీ ఎంపీ నందిగం సురేష్ గురువారం హాజరయ్యారు. తెలుగురావుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెనుముచ్చ పవన్ శిరీష నవ దంపతులకు సురేష్ వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వివాహానికి విచ్చేసిన మాజీ ఎంపీ సురేష్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు శ్రీకాకుళంలోని కరకట్ట వద్ద ఘన స్వాగతం పలికి ఊరేగింపుగా తెలుగురావుపాలెంకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు సింహాద్రి వికాస్ బాబు, ఘంటసాల జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు



పవన్, శిరీష దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎంపీ నందిగం సురేష్

వేమూరి వెంకట్రావు, సచివాలయాల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పార్టీ కృష్ణా జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పైడిపాముల రత్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోండి

చల్లపల్లి: అనుమతి లేకుండా చెట్లు నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. చల్లపల్లి–పెదకళ్ళేపల్లి ప్రధాన రహదారిలో చల్లపల్లి శివారు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల సంరక్షణలో పెరుగుతున్న సుమారు 30 చెట్లను కొన్ని రోజుల క్రితం వరుసపెట్టి నరికి కొందరు నేటమట్టం చేశారు. కొన్ని చోట్ల గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపక్కన చెత్తకు నిప్పంటించడంతో ఆ ప్రాంతాల్లో ఉన్న పచ్చని మొక్కలు సైతం కాలిపోయాయి. గురువారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులతో వచ్చి నరికివేసిన చెట్లను, కాల్చిన ప్రదేశాలను పరిశీలించారు. బుద్ధప్రసాద్ వెంట డాక్టర్ డీఆర్కే ప్రసాద్, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఎ.వి.రమణ, సీఐ సోమేశ్వరరావు, ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.



రోడ్ల పక్కన కాలిపోయిన మొక్కలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కాటన్ దొర సేవలు మరువలేనివి

మోపిదేవివార్పు(మోపిదేవి): సాగునీటి రంగానికి సర్ ఆర్థర్ కాటన్ దొర అందించిన సేవలు మరువలేనివని నియోజకవర్గ నేత మండలి వెంకట్రామ్ అన్నారు. మండలంలో మోపిదేవివార్పు వద్ద సర్ తారథర్ కాటన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్‌దొర విగ్రహానికి పూలమాల వేశారు. ఇరిగేషన్ ఏఈలు పి.రవితేజ, డి.విజయ్‌కుమార్, సర్పంచ్ ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవివార్పు... కాటన్ దొర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

పశువుల దాణా అందజేత

అవనిగడ్డ: పులిగడ్డ రైతుసేవా కేంద్రం వద్ద పశుపోషకులకు సబ్సిడీపై పశువుల దాణా అందజేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ పశుపోషకులకు దాణాను అందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సాంబశివరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, డాక్టర్ నాగార్జున, రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జి శైలజ, ల్యాబ్ అసిస్టెంట్ డేవిడ్ పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గానికి తాగునీరు

గూడూరు: జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి తాగునీరు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద రూ.2.40కోట్లతో చేపట్టిన ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు దాదాపు రూ.2 వేల కోట్లు జలజీవన్ మిషన్ నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), కూటమి నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లయ్య), స్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్‌లను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెడన: మండలంలో శుక్రవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు గమనించాలని కోరారు.

నాగ రమేష్‌కు నివాళి



మచిలీపట్నంటౌన్: సత్య గోల్డ్ అధినేత నూకల నాగ రమేష్ (45) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపై పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాజుపేటలోని ఆయన నివాసం వద్ద మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని), మంత్రి కొల్లు రవీంద్ర, బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బండి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా తదితర నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. మధ్యాహ్నం జరిగిన నాగ రమేష్ అంతిమయాత్రలో పేర్ని నానితో పాటు పలు పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన మట్టి ట్రాక్టర్

కోనేరుసెంటర్: బందరు మండలం సుల్తానగరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో కరెంటు పోల్ పూర్తిగా ధ్వంసమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సుల్తానగరం నుంచి కొంతమంది ట్రాక్టర్లపై అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అందులో ఓ మట్టి ట్రాక్టర్ సుల్తానగరం శివారు ప్రాంతంలో అదుపుతప్పి కరెంటుపోల్‌ను ఢీకొంది. ఘటనలో కరెంటు పోల్ పూర్తిగా విరిగి ట్రాక్టర్‌పై పడింది. డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులతో పాటు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్‌లైన్లకు మరమ్మతులు చేశారు.

వికసించిన 'మే' పుష్పం



ఘంటసాల: ఘంటసాలలో వికసించిన మే పుష్పం పలువురిని ఆకట్టుకుంటోంది. గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్, జలధీశ్వరస్వామి ఆలయం గౌరవ సలహాదారులు, సిద్ధాంతి పిసుపాటి వెంకట నరసింహారావు ఇంటి పెరటిలో మామిడి చెట్టు కింద మే పుష్పం వికసించి ఆకర్షణీయంగా ఉంది. ఎరుపు రంగులో పెద్దగా కనిపిస్తున్న మే పుష్పాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పందుల నియంత్రణకు చర్యలు తీసుకోండి

ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): నగరాలు, పట్టణాల పరిధిలో పందుల సంచారంతో ప్రజలకు ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో సంబంధిత అధికారులు, పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లాలో పందుల కారణంగా ప్రజలకు ముప్పు వాటిల్లకుండా నియంత్రించేందుకు జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్‌తో పాటు పశుసంవర్ధకశాఖ అధికారి, మునిసిపల్ కమిషనర్లు, డీపీవో, సాంఘిక సంక్షేమాధికారి, ఎస్టీ సంక్షేమాధికారి, మెప్మా పీడీ సభ్యులుగా ఉంటారన్నారు. పెంపకందారులకు పందులను పట్టణాల్లో, ఎక్కడపడితే అక్కడ పెంచకుండా వీధుల్లో తిరగకుండా ఊరికి దూరంగా నిర్దిష్ట ప్రదేశంలో పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. వార్డు సచివాలయాల పరిధిలో పందుల పెంపకందారులను గుర్తించి వారితో మునిసిపాల్టీ పరిధిలో సమావేశం నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ వీవీ నాయుడు, పశుసంవర్ధకశాఖ అధికారి చిననరసింహులు, మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, మనోహర్, వెంకటేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణిదూర్జటి, పెంపకందారులు పందుల శ్రీను, కె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

త్వరగా అసంపూర్తి ఇళ్ల నిర్మాణం

పెడన: మండల పరిధిలోని లే అవుట్లలోను, సొంత స్థలాల్లో ఇంటిని నిర్మించుకోవడానికి గృహ నిర్మాణ శాఖ అనుమతులు మంజూరు చేసిన ఇళ్లను త్వరిత గతిన పూర్తయ్యేలా చూడాలని పెడన ఎంపీడీవో ఎ. అరుణకుమారి అన్నారు. ఎంపీడీవో తన చాంబరులో గురువారం గ్రామ సచివాలయాలకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో హౌసింగ్ ఏఈ వాహెదాతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఎన్ని ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి, ఎన్ని పూర్తైనవి వివరాలను అడిగి తెలుసుకున్నారు. లే అవుట్లలో 104, సొంత స్థలాలున్న వారు 23 మంది ఉన్నారని హౌసింగ్ ఏఈ వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడిని స్వయంగా కలిసి నెలాఖారులోగా పూర్తిచేసుకోవాలని చెప్పాలన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా రూ.15వేలు నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులు లబ్ధిదారుని ఖాతాలకు జమయ్యాయన్నారు. వీటితో నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని సూచించారు.



ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణకుమారి

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

నాగాయలంక: వ్యవసాయ తరుణం ఆసన్నం కావడంతో మండలంలో రైతాంగానికి సబ్సిడీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎ.సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవాకేంద్రాల్లో 50శాతం సబ్సిడీపై విత్తనాలు విక్రయించేందుకు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికే 30క్వింటాళ్ల జీలుగ, 50 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు వచ్చాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్ కార్డు, భూ వివరాలతో సంబంధిత సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. జీలుగ విత్తనాలు కేజీ సబ్సిడి ధర రూ.61.5(అసలు ధర రూ.123)లకు, పిల్లిపెసర విత్తనాలు రూ.90 (అసలు ధర రూ.180) విక్రయిస్తామని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ప్రభుత్వం అందించే ఖరీఫ్ పెట్టుబడి సాయం పొందడానికి 20వ తేదీలోగా రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ సంజీవరావు పేర్కొన్నారు. పీఎం కిసాన్ మొత్తాలను ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేశామని ఆయన తెలిపారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): సబ్సిడీపై రైతులకు అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను వినియోగించుకోవాలని సర్పంచులు రాచూరి ప్రసాద్ బాబు, గాజుల శ్రీనివాసరావు తెలిపారు. వారు రైతులకు గురువారం విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ చాగంటిపాటి గణేష్ సాయి, రైతులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మె విజయవంతానికి పిలుపు

అవనిగడ్డ: రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎం.పోలినాయుడు కోరారు. స్థానిక వంతెన సెంటర్‌లో శ్రామిక ఆటో వర్కర్స్ యూనియన్ నేతలను కలసి సమ్మె కరపత్రాలు అందజేశారు. జీవో నంబర్ 21ని రద్దు చేయాలని కోరుతూ చేపట్టే ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ వీశ్రీనివాసరావు, రాంబాబు, కాసులు, పి రాంబాబు, గోపీ పాల్గొన్నారు.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: కార్మికుల నడ్డి విరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన సీఐటీయూ చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం. శివశ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో సీఐటీయు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన పథకం యూనియన్, వెల్డింగ్ వర్కర్స్ యూనియన్, అంగన్‌వాడీ ఆయాల అసోసియేషన్ తదితర కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి: కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఇప్పటివరకూ పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఓలా, రాపిడో వంటి కార్పొరేట్ సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లోకి కూడా విస్తరించే ప్రమాదం ఉందని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రాపు పోలినాయుడు అన్నారు. దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల నాయకులను కలుసుకున్నారు. బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ చల్లపల్లి మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, చల్లపల్లి కార్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గంజాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ద్వాదశ ప్రదక్షిణ

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గురువారం ద్వాదశ ప్రదక్షిణ పూజలు నిర్వహించారు. ర్చకులు దీవి పార్థవెంకట రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు భజనలు, సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమాన్ని ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెడన: మండల పరిధిలోని నందమూరు పంచాయతీ కోటవానిపాలెం గ్రామం సమీపంలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో పెడన ఎస్ఐ జి.సత్యనారాయణ తన సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మావిళ్లమ్మ జాతర

కె.కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం గ్రామంలోని శ్రీ మావిళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా ప్రారంభించారు. ఉదయం అమ్మవార్లను కృష్ణా నదికి తీసుకెళ్లి పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, డప్పుకళాకారుల సందడి, యువకుల కేరింతల మధ్య ప్రధాన వీధుల వెంట ఊరేగించారు. కృష్ణా కరకట్టపై ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నేతలు మండలి వెంకట్రామ్, శీలం అశ్వనీకుమార్ టెంకాయలు కొట్టి ఉత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రకటన

[illegible]